క్లుప్తంగా

మెరుగైన విద్యా బోధనే లక్ష్యం

ఎంపీడీఓ గ్యామా



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న గ్యామా, ఎంఈఓ వెంకట్ తదితరులు

దోమ: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీఓ గ్యామా అన్నారు. శుక్రవారం దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, ఎంఈఓ వెంకట్‌తో కలిసి సందర్శించి పరిసరాలు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు

హెచ్‌ఎండీఓ డైరెక్టర్ ప్రసాద్



శివసాగర్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ప్రసాద్ తదితరులు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నందున పలు పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు హెచ్‌ఎండీఓ డైరెక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్‌లోని శివసాగర్ చెరువు, పరిసర ప్రాంతాలు, కార్తికేయ నగర్, వెంకటసాయి నగర్ కాలనీలోని పార్కులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎండీఏ నిధుల కింద 2 పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు శివసాగర్ చెరువు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, టౌన్ ప్లానింగ్ అధికారి వేణుగోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

24న చౌడేశ్వరీమాత జయంతి

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని సిద్దనొంపు వెళ్లే దారిలో వెలసిన నందవరం చౌడేశ్వరీ మాత జయంతి 24వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సంకారపు పవన్ కుమార్, సంకారపు శివకుమార్ తెలిపారు. గురువారం ఉదయం సుప్రభాత సేవ, 6గంటలకు పంచామృతాభిషేకం, 11గంటలకు ప్రత్యేక పూజ, 12.30గంటలకు అన్న ప్రసాద వితరణ, రాత్రి 7గంటల నుంచి భజన నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జంగం శేఖర్ కుటుంబ సభ్యులకు గ్రామస్తులు రూ.11,111లు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోకుల్‌సింగ్, వెంకటప్ప, కిషన్‌సింగ్, సంగప్ప, రాములుగౌడ్, కాశయ్యగౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో మోస్తరు వర్షం

రైతన్నల్లో హర్షం

తాండూరు: తాండూరు నియోజకవర్గంలో శుక్రవారం ఓ మోస్తరు భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కురిసిన వర్షానికి పంట పొలాలు తడిశాయి. మరోవైపు పట్టణంలో కురిసిన వానకు వరద ఉధృతంగా ప్రవహించింది. సాయిపూర్ ప్రాంతంలోని రోడ్డుపై మోకాల్లోతు వరద నీరు చేరింది. పక్షం రోజులుగా వర్షాలు కురవక పోవడంతో వర్షాల కోసం ఎదురు చూసిన రైతులకు శుక్రవారం కురిసిన వానతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవార్డులపై అవగాహన

కేశంపేట: జాతీయ పంచాయతీ అవార్డుల కోసం మండలంలోని అన్ని గ్రామాల వివరాలను పొందుపర్చాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ శాఖ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ.. జాతీయ అవార్డులను 9 కేటగిరీల్లో ఇవ్వనున్నారని తెలిపారు. అవార్డుల కోసం సంబంధించిన ప్రశ్నలను పూర్తిగా చదవాలన్నారు. అనంతరం పూర్తి సమాచారంతోనే సమాధానం రాయాలని సూచించారు. తహసీల్దార్ అజాంఅలీ, ఏఓ శిరీష, ఏఈ పంచాయతీరాజ్ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

రోడ్లు ధ్వంసం

కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడపడంతో పగుళ్లు

- కంకరతేలి, గోతులుగా మారుతున్న రహదారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు, స్థానికులు
- పట్టించుకోని అధికారులు
- రూ. కోట్లలో ప్రజాధనం వృథా



పగుళ్లు ఏర్పడ్డ బీటీ రోడ్డు

దోమ: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేస్తూ, అభివృద్ధికి బీటీ రోడ్లు వేస్తుంటే వాటి నిర్వహణను మాత్రం అధికారులు గాలికొదిలేస్తున్నారు. వేసిన రోడ్లపై యథేచ్ఛగా కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు తిరగడంతో ఏడాది గడవకముందే కంకర తేలి, చీలికలు, పగుళ్లు ఏర్పడి పాడవుతున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో యాసంగి, వానకాలం రెండు సీజన్లలో వాటిని బీటీ రోడ్లపై నడిపిస్తుండడంతో కొన్ని నెలలకే రోడ్లు ధ్వంసమవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

నిబంధనలకు పాతర

మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా గ్రామాల్లో కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడిపించడంతో అధ్వానంగా తయారవుతున్నాయి. పరిగి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రోడ్డుతో పాటు గడిసింగాపూర్ నుంచి గండీడ్ మండలం రంగారెడ్డిపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు కూడా ఈ మండలంలోనే ఉన్నాయి. వీటిని అనుబంధంగా ఆయా గ్రామాలకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేసి బీటీ రోడ్లను వేస్తుంది. ప్రతీ సీజన్లో కేజ్ వీల్స్ ట్రాక్టర్లు పొలాలు దాటేందుకు రోడ్లపై నుంచే వెళ్తుండడంతో రోడ్లు పూర్తిగా కంకర తేలి, పగుళ్లు ఏర్పడుతున్నాయి. కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను రోడ్లపై నడిపించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఏళ్లకాలం ఉండాల్సిన రోడ్లు అతి తక్కువ కాలంలోనే అవి పాడవుతున్నాయని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు శూన్యం

రోడ్లపై కేజ్‌వీల్స్‌లతో ట్రాక్టర్లు ప్రయాణిస్తుంటే సదరు యజమానులపై ఆర్‌అండ్‌బీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేయాలి. కానీ మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు అలాంటి కేసులు ఒక్కటీ నమోదవ్వలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేజ్‌వీల్స్ వల్లే బీటీ రోడ్లు ధ్వంసమవుతున్నాయని అధికారులకు తెలిసినా పట్టించుకునే వారు లేరు. ఈ విషయంలో తమకేమి సంబంధం లేనట్లు వ్యవహరించడం ఆందోళనకరం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై వెళ్లకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాత్రి వేళల్లో ఇబ్బంది



ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేసి బీటీ రోడ్లను వేస్తుంటే కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్లపై నుంచి వెళ్లడంతో అవి ధ్వంసమవుతున్నాయి. దోమ మండలంలోని ఆయా గ్రామాలకు గత ప్రభుత్వం వేసిన బీటీ రోడ్లు పగుళ్లు ఏర్పడి అధ్వానంగా మారాయి. దీని గురించి అధికారులకు ఎన్నో సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు తప్పడం లేదు.

– మశ్చేందర్‌రెడ్డి, రాకొండ

కేసులు నమోదు చేస్తాం



గ్రామాల్లో కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్లపై వెళ్తున్నాయని మా దృష్టికి వస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తాం. ప్రతీ ట్రాక్టర్ యజమాని తప్పని సరిగా కేజ్‌వీల్స్‌కు పట్టీలు వేయించి రోడ్లపై తిప్పాలి. కానీ పట్టీలు లేకుండా నడిపిస్తే రోడ్లు పాడవుతాయి. కేజ్‌వీల్స్‌తో వెళ్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలి. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. గ్రామ పంచాయతీల వారికి చాటింపు వేయించి రోడ్లపై కేజ్‌వీల్స్ నడిపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– ఆనంద్‌కుమార్, ఎస్‌ఐ, దోమ

ట్రాక్టర్లు సీజ్ చేస్తాం



రోడ్ల భద్రత గురించి గ్రామాల్లోని ప్రజలు దృష్టి సారించాలి. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం రోడ్లు వేయిస్తున్నప్పటికీ కొంత మంది ట్రాక్టర్ యజమానులు కేజ్‌వీల్స్ పట్టీలు లేకుండా ట్రాక్టర్లను రోడ్లపై నడిపిస్తూ ధ్వంసం చేస్తున్నారనే సమాచారం ఉంది. అలాంటి ట్రాక్టర్ యజమానులను గుర్తించి కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తాం.

– గోవిందమ్మ, తహసీల్దార్, దోమ

అవగాహనతోనే టీబీ నియంత్రణ

మండల వైద్యాధికారి రజిత



మాట్లాడుతున్న రజిత

దోమ: అవగాహనతోనే టీబీ నియంత్రించొచ్చని మండల వైద్యాధికారి రజిత అన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని బాస్‌పల్లి, ఊటుపల్లి, పోతిరెడ్డిపల్లి, బాస్‌పల్లి తండాలో వైద్య సిబ్బందితో కలిసి ఆమె టీబీ ముక్త్ అభియాన్ నిర్వహించారు. క్షయ వ్యాధి, రక్తపోటు, హెచ్‌ఐవీ, ధూమపానం, మధుమేహం తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..టీబీతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. దగ్గు, ఛాతిలో నొప్పి, జ్వరం, బరువు తగ్గుట, ఆయాసం ఉన్నట్లు లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ ఉన్న ప్రతి పేషెంట్ పౌష్టికాహారం తీసుకుంటూ మందును క్రమం తప్పకుండా వాడాలన్నారు. ప్రతి టీబీ పేషెంట్‌కు ప్రభుత్వం ప్రతి నెల రూ.1000 సాయం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ ప్రభులింగం, ఉప కేంద్రం వైద్యులు భార్గవి, శ్రీకాంత్, చందర్, సూపర్‌వైజర్లు సరస్వతి, గోపాల్, టీబీ హెల్త్ విజిటర్ రాజునాయక్, ఏఎన్‌ఎంలు యాదయ్య, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

19, 21తేదీల్లో తపాలా సేవలకు అంతరాయం



కొడంగల్ తపాలా కార్యాలయం

కొడంగల్ రూరల్: కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెడుతున్న క్రమంలో 19, 21వ తేదీలలో తపాలా సేవలు నిలిపివేయనున్నట్లు మహబూబ్‌నగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయజ్యోతి తెలిపారు. ఈ విషయంలో వినియోగదారులు, ఖాతాదారులు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ డివిజన్ పరిధిలోకి కొడంగల్ తపాలా కార్యాలయం ఉందని ఆమె తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి నూతన సాంకేతిక పరిజ్ఞానం అమలులోకి వస్తుందన్నారు. తపాలాశాఖ కార్యాలయాల ద్వారా సేవలన్నింటిని ఒకే గొడుగు కిందకు తెచ్చి అమలు చేయనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఐటీ 2.0పేరుతో నూతన సాఫ్ట్‌వేర్ రూపొందించనున్నామన్నారు. ఈ సాఫ్ట్‌వేర్‌లో కార్యకలాపాల డేటా భద్రతను పెంచుతుందని చెబుతున్నారు. అలాగే ఉద్యోగుల పని సామర్థ్యం పెరగడమే కాకుండా సేవలు మెరుగవుతాయని వివరించారు. తపాలాశాఖ తెలంగాణ సర్కిల్ అంతటా ఈ నెల 22వ తేదీ నుంచి ఐటి 2.0 అమలుచేయనుంది.

సాయిపూర్‌లో బోనాలు



తాండూరు టౌన్: బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

తాండూరు టౌన్: పట్టణంలోని సాయిపూర్‌లో బోనాల సందడి అంబరాన్ని తాకింది. శుక్రవారం తాతగుడి సమీపంలోని ఈశ్వరమ్మ ఆలయం, సాయిపూర్‌లోని కట్ట మైసమ్మ ఆలయంలో అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ దీప, మాజీ కౌన్సిలర్లు సావిత్రి, నీరజ, సాయిపూర్ చిన్నారులు, మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ డీపీసీ సభ్యులు పట్లోళ్ల నర్సిములు, బీఆర్‌ఎస్ నాయకులు పట్లోళ్ల నర్సిములు, కాంగ్రెస్ నాయకులు బంటు మల్లప్ప, బంటు వేణుగోపాల్, ఇందూరు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో..

నవాబుపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బోనాల పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని పోచమ్మ దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పోతరాజుల వేషధారణలో విద్యార్థులు నిర్వహించిన విన్యాసాలు పలువురుని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని కాపాడుకుందాం



సమావేశంలో నినదిస్తున్న నాయకులు

కొత్తూరు: అట్రాసిటీ చట్టాన్ని రక్షించుకునేందుకు ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉండాలని కుల అసమానతల నిర్మూలన సమితి ఆల్ ఇండియా కన్వీనర్ బండారు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సరోజన ఆధ్వర్యంలో మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో గురువారం రాత్రి కారంచేడు దళిత మృతవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... నాడు కారంచేడులో దళితులపై జరిగిన మారణకాండకు నేటికి నలభై ఏళ్లు పూర్తయినట్లు చెప్పారు. దళితులపై ఆరోజు జరిగిన ఘటనతోనే ఎస్సీ, ఎస్టీ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. పీడితులు ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి మోహనకృష్ణ, నాయకులు చక్రవర్తి, లక్ష్మయ్య, నరేష్, బబ్లు, భిక్షపతి, కౌసల్య, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ నూతన ఎస్‌ఓగా శైలజ



దోమ: కస్తుర్బా గాంధీ నూతన ఎస్‌ఓగా శైలజ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేసిన ఆర్ చైతన్యకు హైదరాబాద్‌లోని నాగోల్ సోషల్ వెల్ఫేర్‌లో హెచ్‌డబ్ల్యూఓగా ఉద్యోగం రావడంతో అప్పటి నుంచి పాఠశాలలో తెలుగు బోధిస్తున్న గీతకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో శంకర్‌పల్లి కేజీబీవీలో సివిక్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహించే శైలజ పరీక్షలనంతరం ఎస్‌ఓగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆమెను దోమ కస్తుర్బాగాంధీ పాఠశాల ఎస్‌ఓగా ఉన్నతాధికారులు నియమించడంతో శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

డ్రగ్స్‌కు బానిస కావొద్దు

ఎస్‌ఐ శంకర్



బషీరాబాద్: యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దని బషీరాబాద్ ఎస్‌ఐ శంకర్ యువతకు సూచించారు. శుక్రవారం గుర్రాల అనంతమ్మ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన సమావేశంలో యువకులకు మత్తు పదార్థాలు వాటి అనర్థాల గురించి అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల ఊబిలో పడిపోయి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత సన్మార్గంలో నడిస్తేనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ చేయడం నేరమని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ నారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాకాంబరిదేవిగా అమ్మవారు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు ఆలయంలో ఆషాఢమాసం ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆలయంలోని భ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి ఆలయంలో భ్రమరాంబికాదేవి భక్తులకు శాకాంబరిదేవిగా దర్శనమించారు. వివిధ రకాల ఆకులు, కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. భక్తిశ్రద్ధలతో ఆలయంలో అమ్మవారిని, శివలింగాన్ని భక్తులు దర్శించుకున్నారు.

దీక్ష విరమణ

శంకర్‌పల్లి: తమ భూముల కోసం 188 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షను కొండకల్ తండావాసులు శుక్రవారం విరమించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ క్రిష్ణ, నాయకుడు రాజు తండావాసులకు నిమ్మరసం ఇచ్చి, దీక్ష విరమింపజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ సమస్యలపై అపర్ణ కంపెనీ యాజమాన్యం సానుకూలంగా స్పందించి, తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఇరువర్గాలు గతంలో పరస్పరం నమోదు చేయించుకున్న పోలీసు కేసులు, తదితర అంశాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకుంటామని తెలిపారు. గతంలో అపర్ణ కంపెనీకి సహకరించినట్లుగానే, భవిష్యత్తులోనూ తమ సహకారం ఉంటుందని సంయుక్త ప్రకటన చేశారు.

లోకల్‌బాడీలో యువతకు పెద్దపీట

ముఖాముఖిలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

బషీరాబాద్: రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పోలీస్ కేసులకు వెరువకుండా కష్టకాలంలో కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలకు ఆయా పదవులు ఇస్తామని స్పష్టం చేశారు. బషీరాబాద్‌లో నిర్వహించిన యువతతో ముఖాముఖీలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో కొందరు నాయకులు యువతను సమావేశాల్లో, జెండాలు మోసే కార్మికులుగా తయారుచేశారని దుయ్యబట్టారు. తాను గ్రామ గ్రామాన పార్టీ కోసం పనిచేసిన యువకుల జాబితాను సిద్ధంచేసి పార్టీ పదవుల్లో, ప్రజాప్రతినిధులుగా కాలానుగుణంగా అందరికీ అవకాశం కల్పిస్తానన్నారు. అలాగే బషీరాబాద్ మండల అభివృద్ధికి 18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.400 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నామన్నారు. గ్రామాల అభివృద్ధిలో యువజన కాంగ్రెస్ నాయకులను భాగస్వామ్యం చేస్తామని, వారు సూచించిన అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పారు. తాండూరులో నిరుద్యోగులకోసం జాబ్ మేళా పెట్టి 3వేల మందికి ఉద్యోగాలు కల్పించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి శ్రీకాంత్, యూత్‌కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్‌గౌడ్, మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, గొట్టిగకలాన్ మాణిక్‌రావు, అల్తాఫ్, సతీష్‌కుమార్, షైబాజ్, జగదీశ్, శ్రీహరి, మాణిక్‌రావు, మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెంటనే మరమ్మతులు చేపట్టాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్



సర్పన్‌పల్లి కాల్వను పరిశీలిస్తున్న నాయకులు

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాల్వలను వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శిమైపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి సర్పన్‌పల్లి ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రాజెక్టు అభివృద్ధిపై దృష్టి సారిస్తే బాగుంటుందన్నారు. దీంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. రెండు కాల్వల కింద 3,300 ఎకరాల వరకు సాగు నీరు 0.3 టీఎంసీల కెపాసిటీ ఉందన్నారు. గతంలో చేసిన పనులు పటిష్ఠంగా చేయకపోవడం వల్లే మళ్లీ మరమ్మతులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుగ్గప్ప, లక్ష్మయ్య, వెంకటయ్య, దశరథ్, వెంకటేశ్, అంజయ్య, జంగయ్య, నర్సింలు, ఆంజనేయులు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

తీరని వేతన వెతలు

- భారంగా కుటుంబపోషణ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధి హామీ కాంట్రాక్టు ఉద్యోగులు
- పట్టించుకోని ప్రభుత్వం



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

దౌల్తాబాద్: మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. సాంకేతిక కారణాలు చూపుతూ విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకునే వారు కరువయ్యారు.

పని ఒత్తిడితో సతమతం

వేతనాలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ విధుల్లో మాత్రం అలసత్వం వహించొద్దంటూ అధికారులు టార్గెట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీ, ఏపీఓలను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లదే కీలకపాత్ర. గ్రామాల్లో పనులు చేయించడం ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉంటుంది. క్షేత్రస్థాయిలోకి వెళ్లి కొలతలు తీసుకుని ఎంబీ రికార్డు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన బాధ్యత మాత్రం టెక్నికల్ అసిస్టెంట్లపై ఉంటుంది. ఒక్కో టెక్నికల్ అసిస్టెంట్‌కు 5నుంచి 6 గ్రామ పంచాయతీల విధులు కేటాయించడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెబుతున్నారు. కూలీలకు రూ.300లు అధికారుల ఆదేశాలతో అందజేస్తున్నారు. అయితే సామాజిక తనిఖీ సమయంలో పని తక్కువ చేశారని రూ.300లు అందించారని టెక్నికల్ అసిస్టెంట్లను బాధ్యులను చేస్తూ వారి నుంచి తిరిగి రికవరీ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. వన మహోత్సవం సందర్భంగా చెట్లు నాటించడం, పశుషెడ్లు, ఇంకుడుగుంతలు, కోళ్ల ఫారాలు షెడ్ల నిర్మాణాలు వంటి విధులు టెక్నికల్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఇలా ఇన్ని పనులు చేసినా వేతనాలు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌కు తిరుగులేదు

టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్



మాట్లాడుతున్న సామ్రాట్

అనంతగిరి: సిమెంట్ వ్యాపారంలో భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌కు తిరుగులేదని టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఓం సాయి ట్రేడర్స్ షాప్‌లో హౌస్ ఓనర్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని, స్లాబ్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారన్నారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ. 20 అధికంగా ఉంటుందని తెలిపారు. అనంతరం డీలర్ కృష్ణ మాట్లాడుతూ భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమానికి భారతి సిమెంట్ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో దంచి కొట్టిన వాన



ధారూరు: నాగసమందర్‌లో ఇళ్ల వద్ద చేరిన నీరు

ధారూరు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వాన దంచికొట్టింది. పది రోజులుగా వర్షాలు లేక పంటలు ఎండిముఖం పట్టాయి. నిత్యం రైతులు వర్షాల కోసం పూజలు చేస్తున్నారు. భారీ వర్షం పడటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో రోడ్లపై భారీగా నీరు నిలిచింది. నాగసమందర్‌లో తోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

నవాబుపేట మండలంలో...

నవాబుపేట: మండలంలోనీ ఎల్లకొండ, లింగంపల్లి, గంగ్యాడ, నారే గూడ, పులు మామిడి, దాతాపూర్, నవాబుపేట, వట్టి మీనాపల్లి, మాదిరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. వర్షాలు కురవాలని ఎల్లకొండ గ్రామస్తులు ఐదు రోజులుగాశివాలయంలో జలాభిషేకం నిర్వహిస్తున్నారు. శుక్రవారం నీళ్ల, పాలతో అభిషేకం చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో భారీ వర్షం కురిసింది. తమ మొక్కులు ఫలించాయని.. శివుడి కరుణించి వర్షం కురిపించాడని గ్రామస్తులు తెలిపారు.

సమష్టి సహకారంతో అభివృద్ధి

చేవెళ్ల: ప్రజల్లో వచ్చే మార్పుతోనే పట్టణ అభివృద్ధికి నాంది పడుతుందని చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశం అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. చేవెళ్ల మండలంలోని 12 గ్రామాల విలీనంతో 6 నెలల కిత్రం ఏర్పడిన మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. టీచర్స్ కాలనీ, కమలానగర్ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా చాలా అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. కొందరు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కోరుతున్నారన్నారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నిర్మాణానికి తప్పనిసరిగా అనుమతులు తీసుకొని, మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.